
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
8-1-2026 (thursday) MAIN EDITION

## శ్రీవాణి దర్శన టికెట్ల జారీలో కీలక మార్పులు



**అక్షరటుడే, తిరుమల:** టీటీడీ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. శ్రీవాణి దర్శన టికెట్ల జారీ విధానంలో మార్పులు చేశారు. ఆఫ్‌లైన్‌లో టికెట్ల విడుదలను నిలిపివేశారు. తిరుమలలో కొలువైన శ్రీవారిని నిత్యం వేలాది మంది భక్తులు దర్శించుకుంటారు. భక్తుల సౌకర్యార్థం టీటీడీ పలు రకాల దర్శన సౌకర్యాలను కల్పిస్తోంది. అందులో శ్రీవాణి దర్శన కోటా కూడా ఉంది. శ్రీవాణి ట్రస్ట్‌కు రూ. 10వేల కంటే అదనంగా విరాళం ఇచ్చిన వారికి ఈ టికెట్లు కేటాయిస్తారు. అయితే వీటిని గతంలో ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా జారీ చేసేవారు. తాజాగా అధికారులు ఆఫ్‌లైన్ జారీ విధానాన్ని నిలిపివేశారు.

## విడిపోయిన గూడ్స్ రైలు బోగీలు..




**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్‌లో ఘోర రైలు ప్రమాదం తప్పింది. కదులుతున్న గూడ్స్ రైలు బోగీలు విడిపోయాయి. వివరాల్లోకి వెళ్తే.. అనంతపురం జిల్లా రాయదుర్గం రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం ఉదయం గూడ్స్ రైలు బోగీలు విడిపోయాయి. ఇనుప ఖనిజం లోడ్‌తో గూడ్స్ రైలు కర్ణాటకలోని మంగళూరుకు వెళ్తోంది. అయితే రాయదుర్గం సమీపంలోకి రాగానే రైలు నుంచి పలు బోగీలు విడిపోయాయి. నాలుగో వ్యాగన్ వద్ద బోగీ లింక్ కట్ కావడంతో ఇంజిన్ నుంచి విడిపోయాయి.

## అమెరికాలో భారతీయులు అరెస్ట్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికాలో పెద్దఎత్తున మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయి. ఇండియానా రాష్ట్రంలో కొకైన్‌ను తరలిస్తున్న ఇద్దరు భారతీయ డ్రైవర్లను అక్కడి అధికారులు అరెస్టు చేశారు. యూఎస్ హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈనెల 4న ఇండియానాలో ట్రక్కుల్లో కొకైన్ తరలించడాన్ని అధికారులు అడ్డుకున్నారు.

## ప్రతి కుక్కను తరలించమని చెప్పలేదు



**అక్షరటుడే, ఢిల్లీ:** వీధిలో ఉన్న ప్రతి కుక్కను తరలించాలని తాము చెప్పలేదని గతంలో ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు గురువారం స్పందించింది. కేవలం సంస్థలు, కార్యాలయాల దగ్గరి నుంచి మాత్రమే వాటిని తరలించమన్నామని పేర్కొంది. వీధి కుక్కల అంశంపై గురువారం కూడా విచారణ జరిగిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది.

## నిలకడగా సోనియా గాంధీ ఆరోగ్యం



**అక్షరటుడే, ఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. కాగా.. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, చికిత్సకు ఆమె శరీరం బాగా సహకరిస్తోందని ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ అజయ్ స్వరూప్ ప్రకటించారు.



## తిలక్ వర్మకు సర్జరీ..

**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** భారత యువ క్రికెటర్ తిలక్ వర్మకు అనుకోని ఆరోగ్య సమస్య ఎదురవడం అభిమానులు, క్రికెట్ వర్గాలను కలవరపెట్టింది. ఆసియా కప్‌లో కీలక ఇన్నింగ్స్‌తో హీరోగా నిలిచిన ఈ హైదరాబాద్ బ్యాటర్ ఇటీవల తీవ్రమైన కడుపు నొప్పితో ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాడు. పరిస్థితి తీవ్రంగా ఉండడంతో వైద్యులు తక్షణమే శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే టీ20 వరల్డ్ కప్‌లో ఆడతాడా లేదా అని సందిగ్ధత నెలకొంది.

## కువైట్‌లో ఇద్దరు భారతీయులకు మరణశిక్ష

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసులో కువైట్‌లోని ఓ న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. మాదకద్రవ్యాలతో పట్టుబడిన ఇద్దరు భారతీయులకు మరణశిక్ష వేసింది. అయితే, వారిద్దరు భారత్‌లో ఏ రాష్ట్రానికి చెందిన వారనే విషయంపై స్పష్టత లేదు. దేశంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించిన కువైట్ అంతర్గత వ్యవహారాల శాఖ ఇటీవల ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. ఇందులో భాగంగా కైఫాన్, షువైఖ్ ప్రాంతాల్లో నిఘా పెట్టిన డ్రగ్ కంట్రోల్ అధికారులు.. ఇద్దరు భారతీయులను అరెస్టు చేశారు.

## హైదరాబాద్‌లో భారీగా చైనా మాంజా పట్టివేత

**అక్షరటుడే, హైదరాబాద్:** చైనా మాంజా నియంత్రణపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఫోకస్ చేశారు. ఈ మేరకు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. దీంతో టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో నిత్యం సోదాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు రూ.1.2 కోట్ల విలువ చేసే చైనా మాంజాను పోలీసులు పట్టుకున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న రూ.1.2 కోట్ల విలువ చేసే చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ, సూరత్, మహారాష్ట్ర నుంచి చైనా మాంజాను తెప్పిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు దుకాణాదారులపై కేసులు నమోదు చేశారు.

**తన మాట వినని దేశాలను దారికి తెచ్చుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లను ఆయుధాలుగా వాడుకుంటున్నారు. తాజాగా రష్యన్ ఆయిల్ కొంటున్న దేశాలపై 500 శాతం సుంకాలు విధించే దిశగా అడుగులు వేస్తున్నారు. రష్యాపై ఆంక్షలు విధించే బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో గ్లోబల్ మార్కెట్లు షేక్ అవుతున్నాయి. దేశీయ స్టాక్ మార్కెట్ తీవ్ర ఒత్తిడికి గురవుతోంది.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**




# ట్రంప్ టారిఫ్ బాంబ్!

- **రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై ఆంక్షలు**
- **మాస్కో ఆయిల్ కొంటే 500 శాతం సుంకాలు విధిస్తామని హెచ్చరిక**
- **కీలక బిల్లుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన యూఎస్ ప్రెసిడెంట్**
- **స్టాక్ మార్కెట్‌లో బ్లడ్‌బాత్.. భారీగా నష్టపోయిన ఇన్వెస్టర్లు**

నోబెల్ శాంతి బహుమతి కోసం ఆరాటపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధాన్ని ఆపడం కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో రష్యాపై ఒత్తిడి పెంచాలని చూస్తున్నారు. రష్యానుంచి చైనా, భారత్, బ్రెజిల్ తదితర దేశాలు భారీగా ఆయిల్ దిగుమతి చేసుకుంటుండడంతో ఆయా దేశాలపై అక్కసుతో ఉన్నారు. ఈ నేపథ్యంలో రష్యాను దెబ్బతీయడం కోసం ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే రష్యానుంచి చమురు కొంటున్నందుకు మన దేశంపై 50 శాతం అదనపు సుంకాలను విధించారు. తాజాగా ట్రంప్ ద్వైపాక్షిక ఆంక్షల బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ బిల్ వచ్చేవారంలో అమెరికా కాంగ్రెస్ ముందుకు రానుంది. సభ దీనిని ఆమోదిస్తే రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై సుంకాలను 500 శాతం వరకు పెంచేందుకు ట్రంప్‌కు అవకాశం ఉంటుంది. ఈ విషయమై రిపబ్లికన్ సెనెటర్ లిన్సే గ్రాహం ఎక్స్ వేదికగా పెట్టిన పోస్టు ఆందోళన రేకెత్తిస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ ఉక్రెయిన్‌లో పుతిన్ చేస్తోన్న రక్తపాతానికి భారత్, చైనా, బ్రెజిల్ పరోక్షంగా నిధులు సమకూరుస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఇకపై ఆ దేశాలు రష్యా చమురు కొనుగోలు చేయకుండా ఈ బిల్లు అడ్డుకుంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రష్యా చమురు కొనుగోలును నిలిపివేస్తామని హామీ ఇచ్చారనే యూస్ వాదనలను భారతదేశం తిరస్కరించింది, జాతీయ ప్రయోజనం మరియు ఇంధన భద్రత కోసం ఇంధన కొనుగోళ్లు జరుగుతాయని పేర్కొంది.


### ఎటూ తేలని చర్చలు..

అమెరికా భారత్‌పై ఇప్పటికే 50 శాతం సుంకాలు విధిస్తోంది. ఇందులో రష్యా నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు 25 శాతం అదనపు టారిఫ్‌లు అమలు చేస్తోంది. వాటిని తగ్గించాలని ఓ వైపు భారత్ కోరుతోంది. ఈ మేరకు ఇరు దేశాల మధ్య చర్చలు సాగుతున్నాయి. భారత్, యూఎస్‌ల మధ్య వాణిజ్య ఒప్పందం ఎటూ తేలడం లేదు. ఈలోగా ట్రంప్ కొత్త సుంకాల పాట పాడడం ఆందోళనకు గురిచేస్తోంది.

### కుదేలైన స్టాక్ మార్కెట్..

ట్రంప్ ప్రతిపాదించిన బిల్లులను ఒకవేళ అమెరికా కాంగ్రెస్ ఆమోదిస్తే భారత్ నుంచి యూఎస్‌కు ఎగుమతులు తగ్గి ఆయా కంపెనీలు నష్టపోయే ప్రమాదం ఉంటుంది. సుంకాలను మరింత పెంచితే అది భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది స్టాక్ మార్కెట్ సెంటిమెంట్‌నూ దెబ్బతీసింది. దీంతో గురువారం మన మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 855 పాయింట్లు, నిఫ్టీ 273 పాయింట్లు పడిపోయాయి.

## ఆర్టీసీలో సూపర్‌వైజర్ కొలువులు



**అక్షరటుడే, హైదరాబాద్:** సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ కోసం తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ జోన్‌ల పరిధిలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ ట్రైనీ, మెకానికల్ సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం 198 పోస్టులను భర్తీ చేయనుంది. గతేడాది జూలై 1 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు దరఖాస్తుకు అర్హులు. జనవరి 20వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం https://www.tgsrtc.telangana.gov.in/careers ను సంప్రదించండి.

## ఉపాధి పథకం పేరు మార్పులో మోదీ కుట్ర: సీఎం



**అక్షరటుడే, హైదరాబాద్:** గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన పీసీసీ, పీఏసీ విస్తృతస్థాయి సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పు వెనుక ప్రధాని మోదీ కుట్ర ఉందని విమర్శించారు. పేదలపై కక్షతో ఈ పథకాన్నే మారుస్తారా? అని ప్రశ్నించారు. నిబంధనల ముసుగులో ఈ పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మెజారిటీ ఉందని, చట్టసభలను వినియోగించి పేదలను అణచివేస్తామంటే కుదరదన్నారు.

## మూడు కోర్టులకు బాంబు బెదిరింపులు

**అక్షరటుడే, ఏపీ:** ఏపీలోని మూడు కోర్టులకు బాంబు బెదిరింపులు రావడం కలకలం సృష్టించింది. చిత్తూరు, అనంతపురం, ఏలూరు కోర్టులకు బాంబు బెదిరింపులు వచ్చాయి. చిత్తూరు కోర్టు ఆవరణలో ఉన్న కారులో బాంబు పెట్టినట్లు ఆగంతకుల నుంచి ఈ-మెయిల్ వచ్చింది. దీంతో పోలీసులు అప్రమత్తమై కోర్టులో ఉన్నవారిని, సిబ్బందిని బయట కు పంపారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేపట్టారు. అలాగే అనంతపురం కోర్టుకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. కోర్టులో ఆత్మాహుతి దాడి జరుగుతుందని అగంతకుడు కాల్ చేశాడు. పోలీసులు, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఏలూరు కోర్టులో కూడా బాంబు పెట్టినట్లు బెదిరింపు రావడంతో తనిఖీలు నిర్వహించారు.




## మహిళపై ఇమ్మిగ్రేషన్ అధికారి కాల్పులు..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ సారి ఓ మహిళపై ఇమ్మిగ్రేషన్ అధికారులు ఫైరింగ్ చేశారు. దీంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. అమెరికాలో ఇటీవల అధికారులు అక్రమ వలసదారులను గుర్తించడానికి తనిఖీలు చేస్తున్నారు. యూఎస్ ఇమ్మిగ్రేషన్ అధికారులు ఈ తనిఖీల్లో పాల్గొంటున్నారు. అయితే మినియాపొలిస్‌లో సోదాలు చేస్తుండగా ఓ మహిళ కారులో ముందుకు వెళ్లడానికి ప్రయత్నించింది. దీంతో అధికారులు కాల్పులు జరపగా.. రెనీ నికోల్ గుడ్ (37) అనే మహిళపై చనిపోయింది. ఈ ఘటనపై తీవ్ర నిరసనలు వ్యక్తం అవుతున్నాయి.

## రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన చంద్రబాబు..: వైఎస్ జగన్



**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుపై మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ విమర్శలు చేశారు. రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని ఆరోపించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై గురువారం జగన్ మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్ట్‌పై వాస్తవాలు అందరికీ తెలియాలన్నారు. రాయలసీమ లిఫ్ట్‌ను ఆపించామని తెలంగాణ సీఎం అసెంబ్లీలో ప్రకటించారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని చంద్రబాబు ఎలా అమ్మకానికి పెట్టారో రేవంత్ రెడ్డి చెప్పారన్నారు. స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రజలను చంద్రబాబు తాకట్టు పెట్టారని ఆరోపించారు. ఇలాంటి చరిత్రహీనులు దేశంలో ఎవరూ ఉండరన్నారు.

## శ్రీలీల భలే బుక్కైందిగా..



**యంగ్ హీరోయిన్ శ్రీలీలకు ఇటీవల ఓ ప్రమోషనల్ ఈవెంట్‌లో అనుకోని పరిస్థితిని ఎదుర్కొంది. ఆమె అనుకోకుండా అడిగిన ప్రశ్న ట్రోలింగ్‌కు దారి తీసింది. శివకార్తికేయన్ హీరోగా నటించిన తాజా తమిళ చిత్రం 'పరాశక్తి' జనవరి 10న విడుదలకు సిద్ధమవుతోంది. ఇది శ్రీలీలకు తొలి తమిళ సినిమా. అయితే కాలేజీ నేపథ్యంతో తెరకెక్కిన ఈ సినిమాను ప్రమోట్ చేయడానికి చిత్ర బృందం తమిళనాడులోని ఓ కాలేజీకి వెళ్లింది. ఈ సందర్భంగా శ్రీలీల స్టూడెంట్స్‌తో మాట్లాడుతూ.. "ఇక్కడ డాక్టర్లు ఎంత మంది ఉన్నారు?" అని అడిగింది. అయితే అది ఆర్ట్స్ కాలేజ్ కావడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కొంతమంది తమిళ నెటిజన్లు శ్రీలీలను ట్రోల్ చేయడం మొదలుపెట్టారు. లైవ్ ఈవెంట్స్‌లో ఇలాంటి చిన్నపాటి పొరపాట్లు సహజమే అని ఆమె అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు.**

**–అక్షరటుడే, సినిమా డెస్క్**

## ప్రణయ్ హత్య కేసులో నిందితుడికి బెయిల్

**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ప్రణయ్ పరువు హత్య కేసులో నిందితుడికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అమృత బాబాయ్ శ్రవణ్‌కుమార్‌కు తుది విచారణ పూర్తయ్యే వరకు బెయిల్ ఇచ్చింది. మిర్యాలగూడలో అమృత, ప్రణయ్ కులాంతర వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో అమృత కుటుంబ సభ్యులు ప్రణయ్‌ను హత్య చేశారు. ఈ పరువు హత్య అప్పట్లో దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశం అయింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అమృత తండ్రి మారుతి రావు గతంలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. అమృత బాబాయ్ శ్రవణ్‌రావు సైతం ఈ కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసులో సుదీర్ఘ విచారణ చేపట్టిన నల్గొండ జిల్లా కోర్టు నిందితులకు జీవిత ఖైదు విధించింది. దీనిపై శ్రవణ్‌రావు హైకోర్టులో సవాల్ చేశారు. తుది విచారణ పూర్తయ్యే వరకు తన బెయిల్ మంజూరు చేయాలని కోరాడు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం బెయిల్ మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది.